ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 8 మే 2024






జోగుళాంబ గద్వాల ఆస్పత్రిలో చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ సౌమ్య

హోరాహోరీ



» ప్రచారానికి మిగిలింది నాలుగు రోజులే..
» దూకుడు పెంచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు
» 10, 11 తేదీల్లో పార్టీల అగ్రనేతల పర్యటనలు
» నారాయణపేట సభకు హాజరుకానున్న ప్రధాన మంత్రి మోదీ
» ప్రియాంక గాంధీ సభ లేదా కార్నర్ మీటింగ్
» మరోసారి సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఉండే అవకాశం



మక్తల్ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి(ఫైల్)



జడ్చర్ల రోడ్ షోలో ప్రసంగిస్తున్న బీజేపీ అభ్యర్థి అరుణ(ఫైల్)

మహబూబ్‌నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకున్నది. ఈ నెల 13వ తేదీన పోలింగ్ జరుగనుండగా.. 48 గంటల ముందే 11వ తేదీన ప్రచారం పూర్తి కానుంది. గతంలో ఎన్నడూ లేనంతగా పార్టీలు హోరాహోరీగా తలపడుతుండటంతో ప్రతిష్టాత్మక పోరుకు పాలమూరు వేదికగా మారిందని చెప్పొచ్చు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా.. ఉదయం ఆరు గంటల నుంచి ఇంటి నుంచి బయల్దేరితే.. రాత్రి 12 గంటలకు మళ్లీ ఇంటికి చేరుకుంటున్నారు. ఆ తర్వాత కూడా అంతర్గత సమావేశాలు, విశ్లేషణలు, ప్రచార సరళి.. ఓట్ల పోలరైజేషన్‌పై దృష్టి సారిస్తున్నారు. రోజుకు కనీసం నాలుగు గంటలు కూడా నిద్రించకుండా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారంటే.. పార్టీలు ఈ ఎన్నికలను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో షెడ్యూల్ వచ్చిన తర్వాత ప్రచార పర్వం మొదలు కాగా.. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలో మాత్రం అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకే కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి పాలమూరు న్యాయయాత్ర పేరుతో పాదయాత్ర చేపట్టారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ కూడా నియోజకవర్గం మొత్తం చుట్టేశారు. ఇక అప్పటి నుంచి ప్రారంభమైన ప్రచార హోరు.. కొనసాగుతూనే ఉంది. ప్రచారానికి నాలుగు రోజుల గడువు మాత్రమే ఉండటంతో.. అభ్యర్థులు మరింత దూకుడుగా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. ఇప్పటివరకు కేవలం గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ కేంద్రాలపై దృష్టి పెట్టగా.. ఇప్పుడు ప్రధాన పట్టణాలు, మునిసిపాలిటీల్లో ప్రచారం సాగనుంది. అలాగే ఆయా పార్టీల రిపోర్టుల ప్రకారం ఎక్కడ పార్టీ బలహీనంగా ఉందో.. అక్కడ ప్రచారానికి ప్రణాళికలు చేసుకుంటున్నారు. ఇప్పటికే బూత్ లెవల్ వరకు నాయకులు, కార్యకర్తలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు 20 నుంచి 50 ఇళ్లకు ఒక కార్యకర్తను నియమించుకున్నారు. అన్ని పార్టీలు ప్రధాన ప్రత్యర్థులకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ప్రయత్నాలు చేస్తున్నాయి. వాగ్దాటి, విమర్శలు, ప్రతి విమర్శలు, మాటల తూటాలతో రాజకీయాన్ని వేడెక్కిస్తున్నాయి.

హామీల వర్షం..

సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఉచిత హామీలు, వాగ్దానాలను నాయకులు ఎక్కువగా ఇస్తుంటారు. కానీ ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆ విధానం కనిపిస్తోంది. ప్రధాన పార్టీలన్నీ హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో ప్రత్యేక విధానాన్ని అవలంబించి.. అభివృద్ధి చేస్తామని అభ్యర్థులు హామీ ఇస్తున్నారు. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా అని కాంగ్రెస్ అంటే.. 60 శాతం నిధులు తెస్తామని బీజేపీ అంటోంది. అలాగే స్కిల్ యూనివర్సిటీ, కృష్ణా- వికారబాద్ రైల్వేలైన్, జిల్లాకో కేంద్రీయ విద్యాలయం, సైనిక్ స్కూల్, మక్తల్, నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ప్రతీ ఎకరాకు సాగునీరు వంటి అంశాలను ప్రస్తావిస్తున్నారు. అలాగే ఇండస్ట్రియల్ హబ్, ఐటీ హబ్, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు, టూరిజం హబ్, లాజిస్టిక్స్ హబ్, ఎడ్యుకేషన్ హబ్, ఆదర్శ నియోజకవర్గాల హామీలతో ప్రచారం చేస్తున్నారు. హామీల విషయంలో బీఆర్ఎస్ కొంత వెనుకబాటులో ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేశామని చెప్పడం తప్ప.. కొత్తగా ఏం చేయబోతున్నారో మాత్రం పెద్దగా చెప్పడం లేదనే విమర్శ ఉంది.

అగ్రనేతల పర్యటనలు..

సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఆయన ఈ పార్లమెంట్ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే ఎనిమిదిసార్లు పర్యటించారు. మూడు సభలు, రెండు కార్నర్ మీటింగులు, మూడు ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. మరోసారి పార్లమెంట్ పరిధిలో ప్రచారం చేసే అవకాశం ఉంది. అలాగే కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ కూడా పర్యటించనున్నారు. ఈ నెల 11న మక్తల్‌లో నిర్వహించే జనజాతర సభలో లేదా ఒక రోజు ముందు షాద్‌నగర్‌లో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో ఆమె పాల్గొనే అవకాశం ఉంది. ఒకవేళ ప్రియాంకా గాంధీ షాద్‌నగర్ మీటింగ్‌కు హాజరైతే.. మక్తల్ జనజాతర సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉంటుంది. అలాగే బీజేపీ అభ్యర్థి డీకే అరుణ తరఫున ఇప్పటికే ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ, ఆ పార్టీ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరుకాగా.. ఈ నెల 10 నారాయణపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రానున్నారు. రానున్న నాలుగు రోజుల్లో బీజేపీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు ప్రధాని మోదీ నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొనగా.. నారాయణపేట సభతో ఉమ్మడి పాలమూరులో రెండు సార్లు పర్యటించినట్లు అవుతుంది. ఇక బీఆర్ఎస్ తరఫున ఇప్పటికే ఆ పార్టీ అధినేత కేసీఆర్ పాలమూరులో రోడ్‌షో, కార్నర్ మీటింగ్ నిర్వహించగా.. ప్రచారం ముగిసేలోపు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా హాజరయ్యే అవకాశాలున్నాయి. సీఎం సొంత జిల్లా కావడంతో ఇంట గెలిచి రచ్చ గెలవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తుండగా.. సీఎం సొంత జిల్లాలో అభ్యర్థిని ఓడిస్తే.. రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయ శక్తి అని నిరూపించాలని బీజేపీ భావిస్తోంది. ఇటీవల దీపాదాస్ మున్షి పాలమూరులో పర్యటించగా.. ఆమె కాంగ్రెస్ గెలుపుపై దిశా నిర్దేశం చేసి వెళ్లారు. ఎక్కడ వీక్ ఉన్నామో ఎప్పటికప్పుడు తెలియజేస్తుండటంతోపాటు ఎమ్మెల్యేలను, ముఖ్య నాయకులను పరుగులు పెట్టిస్తున్నారు. ఓవైపు ప్రచారాన్ని హోరుగా సాగిస్తుండటంతోపాటు పార్టీలో చేరికలు, పోలరైజేషన్‌పై దృష్టి సారిస్తున్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

జోగుళాంబ గద్వాలకు.. ఫీవర్

» జ్వరాల బారిన జిల్లా ప్రజలు
» పెద్దల కంటే చిన్నారుల్లో తీవ్రత అధికం
» ఏప్రిల్‌లో 433 మంది పిల్లలకు చికిత్స

గద్వాల క్రైం, మే 7: జోగుళాంబ గద్వాల జిల్లా ప్రజలు నెల రోజుల నుంచి జ్వరాలతో బాధపడుతున్నారు. గత ఏప్రిల్‌తో పోలిస్తే ఈ నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కేసులు అధికంగా వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అధిక ఎండల వల్ల హైఫీవర్, డయేరియా బారిన పడి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 433 మంది చిన్నారులు గత నెలలో చికిత్స పొందినట్లు ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యుడు శ్యాం తెలిపారు. ఈ నెల ఆరో తేదీ వరకు మరో 50 మంది చిన్నారులు చికిత్స పొందారన్నారు. అలాగే పెద్దవారు ఏప్రిల్‌లో 194 మంది, ఈ నెల ఆరో తేదీ వరకు ఇంకో 54 మంది హైఫీవర్, డయేరియాకు చికిత్స తీసుకున్నారని డాక్టర్లు తెలిపారు.

రోజూ 30 మంది వరకు బాధితులు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ దాదాపు 30 మంది దాకా చిన్నారులు జ్వరాలు, డయేరియాతో బాధపడుతూ వస్తున్నారు. పెద్దవారు 10 మంది దాకా వస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజూ 20 నుంచి 30 మంది దాకా చిన్నారులు చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల ప్రారంభం నుంచే జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని, పెద్దవారికంటే చిన్నపిల్లల్లో తీవ్రత మరింతగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

నీరు ఎక్కువగా తాగాలి

ప్రస్తుతం ఎండల తీవ్రత వల్ల వస్తున్న హైఫీవర్‌తో చిన్నపిల్లలు డీ హైడ్రేషన్ బారిన పడుతున్నారు. దీనివల్ల చిన్నారుల కళ్లు లోపలికి పోవడం, పెదాలు ఎండిపోవడం జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. అప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. వడదెబ్బ బారిన పడితే ఓఆర్ఎస్ పౌడర్‌ను నీటిలో కలిపి తాపాలని, లేదంటే లీటర్ నీటిలో ఆరు చుక్కల నిమ్మరసం, నాలుగు స్పూన్‌ల చెక్కర, ఒక స్పూన్ ఉప్పు కలిపి చిన్నారులకు తాపితే ప్రాణాపాయం తప్పుతుందని చెబుతున్నారు. ఎండలకు నీరు ఎక్కువగా తాగాలని, జంక్ ఫుడ్ తీసుకోవద్దని అంటున్నారు.

తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి



కొన్ని రోజుల నుంచి జోగుళాంబ గద్వాల జిల్లాలో చిన్నారులు, పెద్దలు హైఫీవర్, వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతున్నారు. పెద్దవారితో పోలిస్తే చిన్నపిల్లలలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. డీ హైడ్రేట్ అయ్యే చిన్నారులకు నీరు ఎక్కువగా తాపాలి. ఓఆర్ఎస్ ఇస్తుండాలి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రతీ ఒక్కరు ఇంట్లోనే ఉండాలి. జ్వరం, వాంతులు, విరేచనాలకు గురైతే డాక్టర్‌ను సంప్రదించాలి.

\- శ్యాం, ప్రభుత్వ చిన్నపిల్లల వైద్యుడు, గద్వాల.

రైతులు సుభిక్షంగా ఉండాలి

» అదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం » ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

భూత్పూర్, మే 7: రాష్ట్రంలోని రైతులంతా ప్రజా పాలనలో సుభిక్షంగా ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మునిసిపల్ వైస్ చైర్మన్ కెంద్యాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యక్తలతో సమావేశం అయ్యారు. ప్రచార సరళి ఎలా ఉందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు ఎలా స్పందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ గడపను తట్టి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పొందుతున్న వారికి చెప్పి కాంగ్రెస్‌కు ఓటు వేసేలాచూడాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద ప్రజల అభ్యున్నతి కోసం చాలా కష్టపడుతున్నాడని, ఆయన కష్టంలో మన వంతు భాగస్వామ్యం అవ్వాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త బూతు స్థాయి, వార్డు, గ్రామాల వారీగా పని చేయల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి నాయకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన్‌గౌడ్, నాయకులు శివరాములు, పవన్‌కుమార్, మశ్చందర్, దిలీప్‌కుమార్, మట్టి ఆనంద్, ఆగిరి రవి, నరేందర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనాలి

» మహబూబ్‌నగర్ మార్కెట్ వద్ద రైతుల ఆందోళన
» ఎమ్మెల్యే చొరవతో దిగివచ్చిన వ్యాపారులు



తడిసిన ధాన్యం కొనాలని అధికారిని వేడుకుంటున్న రైతు

పాలమూరు, మే7: మహబూబ్‌నగర్ మార్కెట్‌కు తొమ్మిది రోజుల క్రితం తెచ్చిన ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిపోయింది. దాంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు మంగళవారం మార్కెట్ యార్డు గేటుకు తాళం వేసి, ఆందోళన చేపట్టారు. ఆరుబయట పోసిన ధాన్యం కొనుగోలు చేసిన తరువాతే ధాన్యం వాహనాలను లోపలికి అనుమతిస్తామని భీష్మించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, సూపర్‌వైజర్ వెంకట్రాములు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. వ్యాపారులు ధాన్యం ఎందుకు కొనుగోలు చేయడం లేదో తెలుసుకుని, రైతులను సముదాయించారు. పెద్దదర్పల్లికి చెందిన రైతు గౌరయ్యతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం టెండర్ అయిన ధర(క్వింటాలుకు రూ.2304)కే కొనాలని రైతు కోరగా ఆ మేరకు వ్యాపారి కొనుగోలు చేశారు. మార్కెట్‌లో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని టెండరుదారులు, వ్యాపారులను పురమాయించారు. దాంతో మార్కెట్‌లోని ధాన్యానంతా కొనుగోలు చేశారు. మార్కెట్‌కు మంగళవారం హంస రకం 106 క్వింటాళ్లు, సోన రకం 704 క్వింటాళ్ల ధాన్యం వచ్చిందని మార్కెటింగ్ అధికారి బాలమణి వివరించారు. హంస రకం క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.2027 ఉండగా, కనిష్ఠ ధర రూ.1904, సోనా రకం గరిష్ఠ ధర రూ.2285, కనిష్ఠ ధర రూ.2183 పలికిందని చెప్పారు.

తడిసిన ధాన్యం కొనాలి: శ్రీనివాస్‌గౌడ్

మార్కెట్‌లో తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వారు మార్కెట్‌కు చేరుకుని రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని వ్యాపారులతో కొనుగోలు చేయిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

కొనకుంటే ఐకేపీకి అప్పగించండి: యెన్నం

రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్షానికి తడిసిన ధాన్యంతో రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మార్కెట్‌కు చేరుకున్నారు. ధాన్యం కొనేందుకు కొందరు వ్యాపారులే రావడం సరికాదన్నారు. వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కృష్ణయ్యను పిలిపించి మాట్లాడారు. రైతుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలని, లేదంటే ఐకేపీ వారికి అప్పగించాలని ఆదేశించారు. రైతులు, అధికారులు, వ్యాపారులతో విడివిడిగా మాట్లాడారు. ధాన్యం నిల్వ చేసుకోడానికి ఇబ్బందిగా ఉంటే గోదాములను కిరాయికి ఇవ్వడమేంటని ప్రశ్నించారు. తక్షణమే వాటిని ఖాళీ చేయించాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్, వినోద్‌కుమార్, సిరాజ్ ఖాద్రి పాల్గొన్నారు.



మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెలే యెన్నం

బీజేపీతోనే సుస్థిర పాలన

» మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



మాట్లాడుతున్న డీకే అరుణ

మద్దూరు, మే 7: సమర్థ, సుస్థిర పాలన ఒక్క బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మంగళవారం మద్దూర్ మండలంలోని దోరేపల్లి, రెనివట్ల, దంగాన్‌పూర్, పల్లెర్ల తదితర గ్రామాల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ నరేంద్ర మోదీ గత పదేళ్ల పాలనలో దేశం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కిసాన్ యోజన పథకం కింద పెట్టుబడి సాయం చేయడంతో పాటు సబ్సిడీపై ఎరువులను అందిస్తున్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే రాబోతోందన్నారు. తనను అధిక మెజారిటీతో గెలిపిస్తే ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక నిధులు తెచ్చి, ఉమ్మడి జిల్లాను సశ్యశామలం చేస్తానన్నారు. ఆయా గ్రామాల్లో అరుణకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మద్దూర్, కొత్తపల్లి మండలాల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, శంకర్ రాజశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వానొచ్చె.. ఎండ దంచె

» వనపర్తి జిల్లా కేతేపల్లిలో 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
» వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సోమవారం రాత్రి కురిసన వాన



పిడుగుపాటుకు గురై మృతి చెందిన గొర్రెలు

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/వనపర్తి అర్బన్/గద్వాల టౌన్ మే 7 : పాలమూరు ఉమ్మడి జిల్లాలో సోమవారం అర్ధరాత్రి అకాల వర్షం వచ్చినా పగటి ఉష్ణోగ్రతలు మాత్రం తక్కువ కాలేదు. జిల్లాలోని పలు ప్రాంతాలలో మోస్తరు వర్షం కురిసినా మంగళవారం ఉదయం నుంచే ఎండ ఎప్పటిలానే దంచికొట్టింది. అకాల వర్షాలతో కొన్నిచోట్ల ఉష్ణోగ్రత కొంత తగ్గింది. అయితే ఎండవేడిమి కొంత తగ్గినా ఉక్కపోత, వగడాలులు వీచాయి. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని కేతేపల్లిలో అత్యధికంగా 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఘణపూర్‌లో అత్యల్పంగా 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి, ఇటిక్యాలలో అధికంగా 45.4, మల్దకల్‌లో అత్యల్పంగా 42.3, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో మండలంలో అధికంగా 44.8, నాగర్‌కర్నూల్‌లో అత్యల్పంగా 41.4, మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులలో అధికంగా 41.3, బాలానగర్‌లో తక్కువగా 39.2, నారాయణపేట జిల్లా కోస్గి, మక్తల్‌లో అధికంగా 40 డిగ్రీలు, నర్వ, కృష్ణలో అత్యల్పంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



వడదెబ్బతో మృతి చెందిన మౌలాలి(ఫైల్)

వడదెబ్బతో యాచకుడి మృతి

అమరచింత : వడదెబ్బకు భిక్షాటన చేసి జీవనం కొనసాగిస్తున్న మౌలాలి అనే వ్యక్తి మృతి చెందాడు. అమరచింత పట్టణంలోని పెద్ద పీర్ల మసీదు వద్ద ఉండే బుడకల మౌలాలి(56) అనే వ్యక్తి కొన్నేళ్లుగా భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఎప్పటిలా సోమవారం మరికల్ వారాంతపు సంత ఉండటంతో మౌలాలి అక్కడికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. దీంతో వడదెబ్బకు గురై మధ్య రాత్రి వరకు వాంతులు, విరేచనాలు చేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఒక కొడుకు, కుమార్తె ఉన్నారు.

మూడు జిల్లాల్లో వర్షం

సోమవారం అర్ధరాత్రి వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లా సీసీకుంటలో 10.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దేవరకద్రలో 8.6, మహబూబ్‌నగర్‌లో 4.9, హన్వాడలో 2.9, అడ్డాకులలో 2.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 43.4 మిల్లీ మీటర్ల వర్షం పడగా, సగటున 2.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. వెల్దండలో 10.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, తెలకపల్లిలో 6.5, లింగాలలో 6.3, కోడేరులో 6, కల్వకుర్తిలో 5.5, పెంట్లవెల్లిలో 5, కొల్లాపూర్‌లో 4, పెద్దకొత్తపల్లిలో 2.5, అమ్రాబాదులో 1.8, అచ్చంపేటలో 1.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

పిడుగు పాటుకు గొర్రెల మృతి

పెద్దమందడి: వనపర్తి జిల్లా పెద్ద మందడి మండలం అల్వాల గ్రామంలో సోమవారం రాత్రి వర్షం కురిసి, పిడుగు పడటంతో గ్రామానికి చెందిన టంకరి రమేష్ 20 గొర్రెలు, బుడ్డన్నకు చెందిన మరో 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి.



వనపర్తిలో మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన రోడ్డు



ప్రజా పాలనలో ప్రజలే పాలకులు

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూచకుళ్ల సుహాసన్‌రెడ్డి
- రైతుబంధు జమ చేసినందుకు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బిజినేపల్లి, మే 7 : రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా పాలనలో ప్రజలే పాలకులని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూచకుళ్ల సుహాసన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పార్టీ మండల నాయకులు రైతులతో కలిసి క్షీరాభిషేకం చేసి, మాట్లాడారు. ఎన్నికల కోడ్‌తో మిగిలిపోయిన పదెకరాల లోపు రైతుల ఖాతాల్లో సోమవారం రాత్రి రైతుభరోసా (రైతుబంధు) నగదును సీఎం రేవంత్‌రెడ్డి జమ చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి వెళ్లిన బీఆర్ఎస్ ప్రభుత్వం తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రైతులకు పెట్టుబడి సాయం, రైతు బంధు అమలు చేయడం లేదని తప్పుడు ఆరోపణలు చేసిన వారికి పార్లమెంటు ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి గెలువడం ఖాయమన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీశైలం, కర్నాటి తిరుపతయ్య, గంగన మోని తిరుపతయ్య, గోవింద్ నాయక్, వీరేందర్, భగవంత్‌గౌడ్, కత్తె ఈశ్వర్, ముక్తార్, మొల్గర రాములు, వెంకటేష్ గౌడ్, అజీజ్, శ్రీనివాస్‌గౌడ్, పిట్టల బుచ్చన్న, వంగ వినీత్‌గౌడ్, శివ య్యయాదవ్, పర్వతాలు, పులేందర్ ఉన్నారు.


బిజినేపల్లిలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూచకుళ్ల సుహాసన్‌రెడ్డి

ఎట్టకేలకు చిక్కిన చిరుత

మద్దూర్, మే 7 : గత కొన్ని రోజులుగా నారాయణపేట జిల్లా కొత్తపల్లి, మద్దూర్ మండలాల సరిహద్దు గ్రామాల శివారులో సంచరిస్తూ ప్రజలకు హడలెత్తించిన చిరుత ఎట్టకేలకు ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది. కొత్తపల్లి మండలం దుప్పడ్‌గట్టు శివారులో చిరుత దాడి చేసి లేగ దూడను చంపిన విషయం పాఠకులకు విదితమే. ఈ విషయమై రైతులు ఫారెస్ట్ అధికారులకు సంచారం అందించారు. అయితే ఫారెస్టు అధికారులు అడుగుజాడలను పరిశీలించగా అది చిరుతేనని తేలింది. వాటి అడుగు గుర్తుల ఆధారంగా కిషన్‌నగర్ నందిగామ కారాలగుట్ట సమీపంలో సోమవారం సాయంత్రం బోను ఏర్పాటు చేయగా మంగళవారం తెల్లవారుజామున చిరుత బోనులో చిక్కగా ఫారెస్ట్ అధికారులు అమ్రాబాద్ అడవులకు తరలించారు. ఇదిలా ఉండగా గత ఆదివారం నందిపాడ్ శివారులోని మల్కిజాదరావుపల్లి రెవెన్యూ పరిధిలోని దుబ్బడిగుట్ట సమీపంలోని ఓ పొలంలో చిరుత మృతి చెందిన రెండు రోజులకే మరో చిరుత నందిగామ పరిసర ప్రాంతంలో ఫారెస్ట్ అధికారుల బోనుకు చిక్కడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.


బోనులో చిక్కిన చిరుత

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

మహమ్మదాబాద్ మే 7 : మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల సరిహద్దులలో మహమ్మదాబాద్ మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామం శివారు బొక్కలోని గుట్ట అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం అయింది. పశువుల కాపరులు అటుగా తిరుగుతుండగా దుర్వాసన రావడంతో అక్కడికి వెళ్లి చూడగా కుళ్లిపోయిన మృత దేహాన్ని గుర్తించి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. శరీరం కుళ్లిపోవడంతో కొన్ని కొన్నిరోజుల కిందటే మృతి చెంది ఉండ వచ్చని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే మహమ్మదాబాద్, కుల్కచర్ల మండలాలకు చెందిన పోలీసులు, అటవీశాఖ అధికారులు వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతం కుల్కచర్ల మండలంలోని అనంతసాగర్ గ్రామ పరిధిలోకి వస్తుందని చెప్పడంతో కుల్కచర్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.







నేత్రదానంతో మరొకరికి చూపు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), మే 7 : పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో గల రాఘవేంద్ర సూపర్ మార్కెట్ అధినేత గోవర్ధన్ రెడ్డి సతీమణి శశికళ తన మరణానంతరం కళ్లను దానం చేసి మరొకరికి చూపును ప్రసాదించి సమాజానికి స్ఫూర్తిగా నిలిచారు. మంగళవారం ఆమె మరణించిన అనంతరం ఆమె కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి నుంచి టెక్నీషియన్‌ను పిలిపించి ఆమె నుంచి కార్నియాను సేకరించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ తాను చనిపోయినా మరొకరికి చూపునివ్వాలనే ఆమె ఆలోచన ఎంతో మందికి స్ఫూర్తి దాయకమన్నారు. అదే విధంగా ఆమె కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


నేత్రదానం చేసిన ఆగీరు శశికళ

షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ పరికరాలు దగ్ధం


షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన టీవీ, బియ్యం

ఉండవల్లి, మే 7: గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కూడిన ఈదురు గాలులకు ఒక ఇంటిలోని విద్యుత్ పరికరాలు, రూ.50వేలు నగదు దగ్ధం అయింది. స్థానికులు, బాధితుడు సలీం తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన సలీం వృత్తిరీత్యా సెంట్రింగ్ కార్మికుడు. రోజు మాదిరి గానే సోమవారం రాత్రి భోజనం చేసిన తర్వాత వరుసకు బంధువుల ఇంటి దగ్గర నిద్రపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఉరుములు మెరుపులతో కూడిన విపరీతమైన ఈదురు గాలులు వీయడంతో ఇంటిలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దాంతో ఇంటిలోని టీవీ, కూలర్, ఫ్యాన్, మిక్సీ, బియ్యం, దుస్తులు సైతం దగ్ధమయ్యాయి. మట్టిమిద్దె కావడంతో ఇంటి దూలాలు కూడా కాలిపోయాయి. రూ. 50వేల నగదు సైతం కాలిపోయింది. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు. దీనిపై తహసీల్దార్ సలీమొద్దీన్‌ను వివరణ కోరగా కంచుపాడులో జరిగిన సంఘటన తన దృష్టికి వచ్చిందన్నారు. బాధితుడు తనకు జరిగిన నష్టాన్ని లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఇంటర్ ఫెయిల్ అయ్యానని విద్యార్థిని ఆత్మహత్య

- అనుమానాస్పద స్థితిలో మరో విద్యార్థి

తిమ్మాజిపేట/అమరచింత మే 7 : నాగర్‌కర్నూలు జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని తిప్పలపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని వైష్ణవి(18) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నది. స్థానిక ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని నాగనూల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైష్ణవి ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఫెయిల్ అయ్యింది. అప్పటి నుంచి మనస్తాపంతో ఎవరితోనూ మాట్లాడకుండా ఆలోచనచేస్తూ ఉండేది. మంగళవారం ఉదయాన్నే తల్లిదండ్రులు రాజు, మల్లమ్మ ఉపాధి హామీ పనుల కోసం వెళ్లగా ఒంటరిగా ఉన్న వైష్ణవి ఫినాయిల్ సేవించిందని గమనించిన ఆమె చిన్నాన్న జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ. తెలిపారు.

వనపర్తి జిల్లా అమరచింత మండలం సింగంపేట గ్రామంలో ఓ ఇంటర్ విద్యార్థి అనుమానాస్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రఘు, నాగేశ్వరి దంపతుల మూడో కుమారుడు నితీష్ ఇంటర్ వరంగల్‌లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలో పూర్తి చేశాడు. ఆస్తి భాగపరిష్కారంలో భాగంగా ఇద్దరు అన్నదమ్ములు సింగంపేటలో ఉండగా, తల్లిదండ్రులు మాత్రం చిన్నకుమారుడితో కలిసి ఆత్మకూరులో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఇంటర్ పూర్తి అయిన తరువాత ఆత్మకూరులోని తల్లిదండ్రుల వద్దే ఉంటున్న నితీష్ మంగళవారం ఉదయం ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన చుట్టుపక్కల వారు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వచ్చి చూసే సరికి అప్పటికే నితీష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. విద్యార్థి మృతికి కారణం ఇంటర్ సెకండియర్ ఫలితాలలో నితీష్ ఓ సబ్జెక్టులో ఫెయిల్ అయినందుకా, లేక ప్రేమ వ్యవహారమా అని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని ఎస్ఐ సురేష్ చెప్పారు.





వారం రోజులుగా తాగునీరు బంద్

- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు


తిర్మలాపూర్, రాజాపూర్ రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న రాజాపూర్ మూడవ వార్డు ప్రజలు

రాజాపూర్, మే 7: వారం రోజుల నుంచి తాగునీరు రావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని మూడవ వార్డు మహిళలు తిర్మలాపూర్, రాజాపూర్ రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ రెండు వారాల నుంచి కాలనీలో తాగునీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు, అధికారులకు విన్నవిస్తే పట్టించుకోవడం లేదని వాపోయారు. అందుకే రోడ్డెక్కాల్సి వచ్చిందని వాపోయారు. విషయం తెలుసుకున్న కొందరు నాయకులు అక్కడికి చేరుకొని తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

- కల్వకుర్తిలో మృతుల బంధువుల ధర్నా


కల్వకుర్తిలో ధర్నా చేస్తున్న మృతుల బంధువులు

కల్వకుర్తి, మే 7 : తలకొండపల్లి మండలం వెలిజాల సమీపంలో ఎమ్మెల్యే కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన నరేష్, పరుశరాములు కుటుంబాలను ఆదుకోవాలని మృతుల బంధువులు మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఇందిరాశోభన్‌లు మృతుల బంధువులతో మాట్లాడారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు. అనంతరం కల్వకుర్తిలోని ప్రభుతాసుపత్రిలో పోస్టుమార్టం కోసం వచ్చిన నరేష్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తక్షణ సాయంగా సమకూర్చిన నరేష్ కుటుంబానికి రూ.20 లక్షలు, పరశురాములు కుటుంబానికి రూ.30 లక్షలు బృంగి ఆనంద్‌కుమార్, ఇందిరాశోభన్‌లు అందజేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి బాధిత కుటుంబాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి మార్చరీలో ఉన్న మృతదేహాన్ని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా పరిశీలించి బాధితకుటుంబ సభ్యులను పరామర్శించారు.

వాహనాల తనిఖీలలో నగదు స్వాధీనం


కృష్ణలో స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

ఖిల్లాఘణపురం/కృష్ణ, మే7: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. పలు చోట్ల నగదు పట్టుబడింది. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన స్వామి ద్విచక్ర వాహనంపై రూ. 1,13,700లను తీసుకెళ్తుండగా ఖిల్లాఘణపురం మండలంలోని సోలీపూర్ గ్రామ సమీపంలో వాహన తనిఖీలో నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. నగదును జిల్లా గ్రీవెన్స్ సెల్‌లో డిపాజిట్ చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. నారాయణపేట జిల్లా కృష్ణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేగుంట చెక్‌పోస్టు రాయచూరు జిల్లా మన్వికి వెళ్తున్న మహమ్మద్ హాస్సేన్ అనే వ్యక్తి వాహనాన్ని తనిఖీ చేయగా రూ. 16,47,100 ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ ఎండీ నవీంద్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క


అయిజలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న బర్రెలక్క

అయిజ/వడ్డేపల్లి, మే 7: నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్వతంత్ర్య అభ్యర్థి బర్రెలక్క అన్నారు. అయిజ పట్టణంతో పాటు, వడ్డేపల్లి మునిసిపల్ కేంద్రం శాంతినగర్‌లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఈల గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. తనకు గెలిపిస్తే యువతకు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు. వ్యవసాయదారులకు పంటల సాగుపై అవగాహన కల్గిస్తూ, అధిక దిగుబడి సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి వేడుకలు


ఆలయంలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

మిడ్జిల్, మే 7 : జడ్చర్ల మండలం మీనాంబరం పరుసవేదీశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పల్లకీ సేవలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ ముదిరాజ్ మంగళవారం తెలిపారు. మిడ్జిల్ మండలం బైరంపల్లి గ్రామానికి చెందిన గొడుగు సిరియాలు, నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని మాధారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ధ్యాప బాల్‌రెడ్డి, గద్వాల్ సబ్‌రిజిస్ట్రార్ చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రఘుచారి, ఆలయ కమిటీ సభ్యులు కైలాస్, పర్వతాలు, సునీత, భద్రప్ప, యాదయ్యగౌడ్, మాసయ్య, శ్రీశైలం, కృష్ణ, శ్రీనివాస్, భజన మండలి సభ్యులు దామోదర్, లక్ష్మీనారాయణ, రామచంద్రారెడ్డి, రాములు, శ్రీనివాస్, శంకరప్ప ఉన్నారు.

గాలి బీభత్సం

- ఎగిరిపోయిన ఇంటి పై కప్పు రేకులు

- విరిగి పడిన మామిడి చెట్లు

- వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు పశువుల మృతి

అచ్చంపేటటౌన్, మే7: గాలి బీభత్సానికి ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయిన సంఘటన మంగళవారం అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం అర్ధరాత్రి భారీగా ఈదురు గాలులు రావడంతో మండల పరిధిలోని కన్యాతండా, నడింపల్లి గ్రామాల్లో పలువురి ఇంటిపై కప్పు రేకులు ఎగిరిపోయాయి. కన్యాతండాలో విద్యుత్ స్తంభం కూలింది. నడింపల్లి గ్రామానికి చెందిన ఆకారపు అశోక్, గిడ్డే మల్లయ్య, గిడ్డే లక్ష్మపతి, లక్ష్మయ్యలకు చెందిన ఇళ్ల పై కప్పులు ఎగిరిపోయాయి. బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కోడేరు మండలంలో..

కోడేరు : సోమవారం రాత్రి మండలంలో అకాల వర్షాలు ఈదురుగాలులు రావడంతో బాడుగదిన్నె, నర్సాయిపల్లి తదితర గ్రామాల్లో మామిడి చెట్లు నేలకు ఒరిగిపోయాయి. నర్సాయిపల్లి గ్రామానికి చెందిన చిట్టికొండ నారాయణ 10 మామిడి చెట్లు, అన్నే పర్వతాలు 30 మామిడిచెట్లు, బేబిని శాంతమ్మకు చెందిన 30 మామిడి చెట్లు వర్షానికి ఈదురుగాలులకు విరిగిపడ్డాయని అన్నారు. బాడుగదిన్నె గ్రామానికి చెందిన బిబాలపీరుకు చెందిన 20 మామిడి చెట్లు విరిగిపడ్డాయని మరికొన్ని చెట్లు నేలకు ఒరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పరిశీలించి ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

వంగూరు మండలంలో..

వంగూరు: మండలంలోని పోల్కంపల్లి, చౌదర్‌పల్లి, రంగాపూర్, ఉల్పర తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మామిడికాయాలు నేల రాలడంతో రైతులు నష్టపోయారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పశువుల మృత్యువాత

బల్మూరు/లింగాల/పాన్‌గల్ : వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు రెండు ఆవులు, ఒక గేదె మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనలు నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు, లింగాల, వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలాల్లో సోమవారం రాత్రి చోటు చేసుకున్నాయి. బల్మూరు మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన మూడావత్ హతీరాంకు సంబంధించిన పాడి ఆవు పిడుగుపాటుతో మృత్యువాత పడింది. ఆవు విలువ దాదాపు రూ. 45వేల నుంచి రూ. 50వేల వరకు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే లింగాల శివారులో బునాద్రి బొజ్జయ్య పొలం దగ్గర కట్టివేసిన ఆవుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. అదేవిధంగా ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాలలో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. మామిడి కాయలు నేల రాలాయి. అక్కడక్కడ ఇళ్ల రేకులు లేచిపోయాయి. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలపరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన రైతు సంగనమోని కృష్ణయ్యకు చెందిన గేదె పిడుగుపాటుకు మృతి చెందింది. గేదె విలువ రూ. 50వేలు ఉంటుందని తెలిపారు. బాధిత రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

పాలెంలో..

బిజినేపల్లి : మండలంలోని పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ వ్యవసాయ పరిశోధన స్థానం సమీపంలో మంగళవారం సాయంత్రం గాలి దుమారానికి ప్రధాన రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షం కూలి పడింది. దీంతో నాగర్‌కర్నూల్ వైపు నుంచి బిజినేపల్లి వైపు నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయి గంటకు పైగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. స్థానికులు, వాహనదారులు భారీ వృక్షాని తొలగించేందుకు ఇబ్బంది పడ్డారు.


వంగూరులో నేల రాలిన మామిడి కాయలు

నల్లమలలో మోస్తరు వర్షం

మన్ననూర్: నల్లమల అభయారణ్య ప్రాంతంలో మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూరు, ప్రశాంత్ నగర్, మాచారం, తుర్కపల్లి, వెంకటేశ్వర్లబావి, పర్హాబాద్ , మల్లాపూర్, రాంపూర్ పెంటల్లో భారీగా వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా నల్లమలలో 42డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్న క్రమంలో మంగళవారం రాత్రి గంటన్నరపాటు వర్షం కురవడంతో వాతా వరణం చల్లబడడంతో నల్లమల వాసులు, వన్యప్రాణులకు సైతం ఈ వర్షం ఊరటనిచ్చేంది.


కోడేరులో ఈదురుగాలులకు నేలకొరిగిన మామిడి చెట్లు


నడింపల్లి గ్రామంలో గాలి బీభత్సానికి ఎగిరిపోయిన ఇంటి పైకపు రేకులు


నర్సాయిపల్లిలో పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు

క్రీడల్లో రాణించడం అభినందనీయం

- పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్‌రాథోడ్

- క్రీడాకారిణి సాయిసంగీతకు సన్మానం

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, మే 7 : జూనియర్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారిణి డీ.సాయిసంగీత భారత జట్టు తరుపున ఆడి స్వర్ణం సాధించడం హర్షణీయమని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. మంగళవారం మంగళవారం పాలమూరు యూనివర్సిటీలో సాయిసంగీతను వీసీ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల మొదటివారంలో దుబాయ్‌లో నిర్వహించిన జూనియర్ ఏషియాన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన డీ.సాయిసంగీత 4-100మీటర్ల రిలే రేస్ విభాగంలో భారత జట్టు తరుపున ఆడి స్వర్ణ పతకం సాధించినట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరులో అథ్లెటిక్స్ శిక్షణ పొందుతోంది. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ సారంగపాణి, ఇండియా చీఫ్ కోచ్ రమేష్, జిల్లా సెక్రటరీ శరత్‌చంద్ర పాల్గొన్నారు.


సాయిసంగీతను సన్మానిస్తున్న వీసీ, అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు

వ్యక్తి ఆత్మహత్య

మల్దకల్, మే 7: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గద్వాల జిల్లా మల్దకల్ మండంలోని మల్లెందొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన తెలుగు నాగేష్(40) అప్పుల బాధ భరించలేక సోమవారం ఉదయం తమ పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కుటుంబీకులు అక్కడకు చేరుకుని నాగేష్‌ను చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. మృతురాలి భార్య పద్మమ్మతో పాటు ముగ్గురు సంతానం ఉన్నారు. ఈసంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకుల ఆర్థిక సాయం

భూత్పూర్, మే 7: ఆటో బోల్తా పడిన సంఘటనలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన ఎద్దుల నరేష్‌గౌడ్(30) అనే వ్యక్తి వృత్తి రీత్యా క్యాటరింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నెల 6న శేరిపల్లి(బీ) గ్రామానికి ఆటోలో క్యాటరింగ్ ఆర్డును ఇచ్చి తిరిగి వస్తుండగా తాటిపర్తి గ్రామ శివారులో ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆటోను నడిపిస్తున్న నరేష్‌గౌడ్‌కు, మరో వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. ఇద్దరిని స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే సోమవారం సాయంత్రం నరేష్‌గౌడ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ శ్రీనివాసులు తెలిపారు. కాగా, భూత్పూర్ మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు వెంకటయ్య, ఫసియోద్ధిన్, తదితరులు ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి భార్య మౌనికకు బీఆర్‌ఎస్ నాయకులు అంత్యక్రియల నిమిత్తం రూ.40వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

డిస్పెన్సరీలో వైద్యసేవలు ప్రారంభించాలి

- మహబూబ్‌నగర్ ఈఎస్‌ఐ ఆస్పత్రి ఎదుట ఏఐటీయూసీ నాయకుల ఆందోళన

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మే7: మహబూబ్‌నగర్ ఈఎస్‌ఐ డిస్పెన్సరీ అద్దె బకాయిలు చెల్లించాలని, వైద్య సేవలు వెంటనే ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏనుగొండ వద్ద గల ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఎదుట మంగళవారం ఏఐటీయూసీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ఈఎస్‌ఐ డిస్పెన్సరీకి రెండు రోజులుగా తాళం వేసి ఉంచారని, ఇదేంటని అడిగితే అద్దె బకాయిల విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అయితే రెండు రోజులుగా డిస్పెన్సరీకి తాళం వేయడం వలన వైద్యసేవలు నిలిచిపోయాయని, కార్మికులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అద్దెభవనంలో కొనసాగుతున్న డిస్పెన్సరీకి రెండు సంవత్సరాలుగా అద్దె బకాయిలు చెల్లించడం లేదని, దీంతో తాళం వేసినా ఈఎస్‌ఐ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఉమ్మడి జిల్లాకే తలమానికంగా ఉన్న ఈ డిస్పెన్సరీలో బీమా చేయించుకున్న కార్మికులు, చిరు ఉద్యోగులు వందల సంఖ్యలో వైద్యం పొందుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో డిస్పెన్సరీకి తాళం వేస్తే పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. అద్దె బకాయిలు వెంటనే చెల్లించి వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సంతోష్, ఈఎస్‌ఐ రోగులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వేసవి క్రికెట్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 7 : వేసవి క్రికెట్ శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. హైదరాబాద్‌లో క్రికెట్ అసోసియేషన్ సహకారంతో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఎండీసీఏ మైదానంలో నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. క్రీడాకారులకు అరటి పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను ఉమ్మడి జిల్లాలో ఆరు చోట్ల శిక్షణ శిబిరాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. 2016 తరువాత ఉమ్మడి జిల్లాలో వేసవి శిబిరాలు ఏర్పాటు చేశామ న్నారు. శిక్షణ శిబిరాల్లో రాణించే క్రీడాకారులకు హెచ్‌సీఏ క్రీడాపోటీలకు ఎంపిక చేసే అవకాశాలు ఉంటుందన్నారు. మహ బూబ్‌నగర్, జడ్చర్ల, కోస్గి, కల్వకర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ శిక్షణ శిబిరాల్లో నిష్ణాతులైన శిక్షకుల చేత శిక్షణ అందజేస్తున్నామన్నారు. ఈ నెల 20 వరకు వేసవి శిబిరాలు కొనసాగుతాయ న్నారు. కార్యక్రమంలో కోచ్‌లు పాల్గొన్నారు.


వేసవి క్రికెట్ శిబిరాన్న పరిశీలిస్తున్న ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

యువకుడి అదృశ్యం

ఎర్రవల్లి, మే 7: ఎర్రవల్లిలోని ఓ వెల్డింగ్ షాపులో పని చేస్తున్న యువకుడి అదృశ్యమయ్యాడు. మంగళవారం ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా రేచింతల గ్రామానికి చెందిన ఆవుల గోపాల్ ఎర్రవల్లిలోని ఓ వెల్డింగ్ షాపులో పని చేసేవాడు. గత నెల 28నుంచి పనికి రాకపోవడంతో సహచరుడైన పరమేష్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. దాంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికిన ఆచూకీ లభించకపోవడంతో తండ్రి ఆవుల శ్రీను మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరింత మెరుగుపర్చాలి

- మల వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

మహబూబ్‌నగర్,మే7: పాలమూరు పురపాలిక పరిధిలో నిర్వహిస్తున్న మల వ్యర్థాల నిర్వహణకేంద్రం (ఎఫ్‌ఎస్‌టీపీ) ను మంగళవారం కేంద్రబృందం పరిశీలించింది. పట్టణ సమీపంలోని మౌలాలి గుట్టలో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. మానవ మలవ్యర్థాలను సెప్టిక్‌ట్యాంక్ నుంచి సేకరించి ఎఫ్‌ఎస్‌టీపీలో శుద్ధి చేసి ఎరువులు తయారు చేయనున్నారు. శుద్ధిచేసిన నీటిని, ఎరువులను మొక్కలకు వేయడంతో పాటు ఎరువులను విక్రయించి ఆదాయం సమకూరుకోవచ్చన్న ఉద్దేశంతో ఈ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయడం జరిగింది. పురపాలికలో ఏఎస్‌సిఐ అనే సంస్థకు ఈ నిర్వహణ భాద్యతలను అప్పగించారు. కాగా ఈ కేంద్రాన్ని మంగళవారం సెంట్రల్ పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ ప్రతినిధి సంజయ్‌రౌత్ సందర్శించారు. ఏఎస్‌సిఐ సంస్థ ప్రతినిధులతో ఎఫ్‌ఎస్‌టీపీ నిర్వహణ, ఉపయోగిస్తున్న టెక్నాలజీని అడిగి తెలుసుకున్నారు. ఎరువుల తయారి, శుద్ధిచేసిన నీటి వినియోగంపైనా వివరాలు సేకరించారు. వీటినుంచి శాంపిల్స్ కూడా కలెక్ట్ చేయడం జరిగింది. కాగా పెద్ద మునిసిపాలిటీ అయిన పాలమూరు పురపాలికలో సెప్టిక్ వ్యర్థాలు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు చాలాతక్కువగా వస్తుండంతో దీనిపై దృష్టి సారించాలని పుర అధికారులకు సూచించారు. ప్రతిరోజు 2,3 సెప్టిక్ వ్యర్థాలను తీసుకువచ్చి ట్రీట్‌మెంట్ చేయాలని అప్పుడే ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. దీనిపై అవగాహన కల్పించడంతోపాటు వ్యర్థాలు తరలించే కార్మికులతో సమావేశాలు నిర్వహించి ఎక్కడపడితే అక్కడ వాటిని పడవేయకుండా ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పురకమిషనర్ మహేశ్వర్, శానిటరి ఇన్స్‌పెక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎఫ్‌ఎస్‌టీపీని పరిశీలిస్తున్న కేంద్రప్రతినిధులు

ఉద్యోగులకు ఇబ్బంది కలగొద్దు

- ఫెసిలిటేషన్ కేంద్రం పరిశీలించిన కలెక్టర్ జి. రవి నాయక్



స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ జి. రవి నాయక్

మహబూబ్‌నగర్ టౌన్, మే 7 : ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునేందుకు వచ్చిన ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ప్రక్రియను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులకు అసౌకర్యం కలగకుండా హెల్ప్ డెస్క్‌లో ఏర్పాటు చేసిన సిస్టం లేదా ల్యాప్ టాప్ ఆధారంగా ఎపిక్‌ను పరిశీలించి ఓటు వేసే గది ఇతర వివరాలను ఓటు వేయడానికి వచ్చిన ఉద్యోగికి స్పష్టంగా తెలియజేప్పాలని ఆదేశించారు. ఓటు వేసేందుకు వచ్చే ప్రతీ ఉద్యోగికి తప్పని సరిగా ఓటు వేసేలా అవకాశం కల్పించాలని ఆయన తెలిపారు.

కుష్ఠు వ్యాధి నివారణే లక్ష్యం

- జిల్లా లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జరీనా



గండీడ్‌లో కుష్ఠు వ్యాధి సోకిన వారిని పరిశీలిస్తున్న డాక్టర్ జరీనా

గండీడ్, మే 7 : కుష్ఠు వ్యాధి నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జరీనా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ఆయా గ్రామాల నుంచి గురించగా, వారిని మంగళవారం పరిశీలించారు. 35 మందికి కుష్ఠు వ్యాధి పరీక్షలు చేయగా ముగ్గురికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మంపై తెల్లని మచ్చలు ఉంటే తప్పకుండా వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గండీడ్ వైద్యాధికారి చంద్రశేఖర్, సూపర్‌వైజర్, నరసింహారెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

- దివ్యాంగుల సంఘం రాష్ట్ర చైర్మన్ వీరయ్య

మహబూబ్‌నగర్, మే 7 : దివ్యాంగుల సంక్షేమానికి ముందు నుంచీ అండగా నిలబడుతున్న కాంగ్రెస్ పార్టీని అందరూ బలపరచాలని వికలాంగుల సంఘం రాష్ట్ర చైర్మన్ వీరయ్య కోరారు. అదే సమయంలో దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలాంటి కృషి చేయలేదని, అందుకే బీజేపీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు పింఛన్ చేసిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తు చేశారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు జీవన భద్రత ఉండాలని, ఆహారభద్రత ఉండాలని అంత్యోదయ కార్డులు ద్వారా 35 కిలోల బియ్యం ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తు చేశారు. వికలాంగులకు 150 రోజుల పనిదినాలు కల్పించాలని కాంగ్రెస్ చట్టం తీసుకువస్తే పదేళ్ల బీఆర్ఎస్, బీజేపీ పాలనలో ఏనాడూ 150 పనిదినాలు కూడా కల్పించలేదని, అందుకే ఈ రెండు పార్టీలను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- గుడిమల్కాపూర్ పోలింగ్ బూత్‌ను పరిశీలించిన సాధారణ పరిశీలకుడు షేవాంగ్ గ్యాచో భూటియా



చెంచులతో మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ షేవాంగ్ గ్యాచో భూటియా

హన్వాడ, మే 7 : ప్రతీ ఓటరు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ (ఐఏఎస్) షెవాంగ్ గ్యాచో భూటియా ఓటర్లు వివరించారు. మంగళవారం గుడిమల్కాపూర్ గ్రామంలోని 33, 34 పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెంచులతో మాట్లాడారు. వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారా, మరుగుదొడ్లు ఉన్నాయా, వాడుతున్నారా అని వారిని అడిగి తెలుసుకొని, పరిశీలించారు. ఓటు అమ్ముకోవద్దని, మద్యానికి లొంగవద్దని తెలిపారు. అనంతరం పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించి బీఎల్వోలతో మాట్లాడారు. ఓటర్లకు ఓటరు స్లిప్పులు అందించారా, వృద్ధులను గుర్తించి వారి సౌకర్యాలు కల్పించారాఅని వారిని అడిగి తెలుసుకున్నారు. బూత్‌లో మంచినీరు, ఎండ లేకుండా సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎన్నికల ఖర్చుల అబ్జర్వర్, ఐఆర్ఎస్ వరుణ్ రంగస్వామి, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

పదేళ్లలో రైతులకు తీరని అన్యాయం

- తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి

మిడ్జిల్, మే 7 : కేంద్రంలోని మోదీ సర్కార్, రాష్ట్రంలో గతంలో సీఎం కేసీఆర్ సర్కార్ రైతులకు ద్రోహం చేశారని ఆయా పార్టీల అభ్యర్థులకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి అన్నారు. మంగళవారం జడ్చర్ల పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని అభిప్రాయ పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతులకు ఉపయోగపడే విధంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టనుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివకుమార్ బాద్మీ, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మన్నెం జనార్దన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

రేవంత్‌ని కాపాడుకోవాలంటే ఎంపీలను గెలిపించాలి

- 70 ఏళ్లలో పాలమూరుకు ముఖ్యమంత్రి అవకాశం వచ్చింది
- బీకేరెడ్డి కాలనీ కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ఆశీర్వదిస్తే మీకోసం పనిచేస్తా : ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మే 7 : మహబూబ్‌నగర్ ఎంపీగా కేసీఆర్‌ను గెలిపిస్తే ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత పాలమూరుకు చేసిందేమీ లేదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు కానీ తన ప్రాంతమైన సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లాకు లక్షకోట్లు ఖర్చుచేశారని, మరి పాలమూరు వాటా ఏమైందని ప్రశ్నించారు. అందుకే ఈ ప్రాంత బిడ్డ రేవంత్‌రెడ్డిని మనమంతా కలిసి ముఖ్యమంత్రిని చేసుకున్నామని, ఇక పాలమూరు అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకున్నంత మాత్రాన సరిపోదని, ఆ కుర్చీలో పదికాలాలు ఉండాలంటే మనమంతా అండగా నిలబడాలని, ఆయన ఇలాఖ అయిన పాలమూరు ఎంపీని గెలిపించాలని, అప్పడే ఆయనను కాపాడుకోగలుగుతామని చెప్పారు. లేదంటే ఆయన కుర్చీకే ఎసరుపెట్టే ప్రమాదం ఉంటుందని, కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. మహిళలంతా కలిసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చారని, రేవంత్‌ను ముఖ్యమంత్రిని చేశారని, ఈ ఎన్నికల అంతకన్నా ప్రతిష్ఠాత్మకమైనదని, అందరూ కాంగ్రెస్‌కు అండగా నిలబడాలని కోరారు. మంగళవారం రాత్రి పట్టణంలోని బీకే రెడ్డి కాలనీలో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరికీ వడ్డీ లేని రుణాలివ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ఎన్నికల కోడ్ కారణంగా రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ఆగిపోయాయని, ఎన్నికల అనంతరం అమలులోకి వస్తాయన్నారు. ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ తాను డబ్బు సంపాదన కోసం ఇతర పార్టీల నాయకుల మాదిరిగా రాజకీయాలలోకి రాలేదన్నారు. మీ అందరి కష్టాలు తెలిసిన వాడినని, ఆశీర్వదిస్తే మీ బిడ్డగా, మీలో ఒకడిగా సేవ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు వినోద్‌కుమార్, ఎన్‌పీ వెంకటేశ్, రాధాఅమర్, సిరాజ్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

● గాలిదుమారంలోనే సభ : బీకే రెడ్డికాలనీలో సభ ప్రారంభానికి ముందే గాలిదుమారం ప్రారంభమైంది. కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కరెంట్ లేకున్నా వాహనాలు లైట్లు వేసుకుని గాలిదుమారం మధ్యే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు సభను కొనసాగించారు. సభకు పెద్దఎత్తున జనం తరలివచ్చారు.

అనన్యరెడ్డిని సన్మానించిన రెడ్డి సేవా సమితి నాయకులు



అనన్యరెడ్డిని సన్మానిస్తున్న పాలమూరు రెడ్డి సేవా సమితి నాయకులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 7 : మహబూబ్‌నగర్ పట్టణంలో మంగళవారం రాజా బహద్దూర్‌రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్-2023 ఆల్ ఇండియా మూడవ ర్యాంకు సాధించిన దోనూరు అనన్యరెడ్డిని, ఆమె తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. అతిథులుగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది వి. మనోహర్‌రెడ్డి, మద్ది అనంతరెడ్డి, బుర్రి వెంకట్రామారెడ్డి, పోతుల రాఘవ రెడ్డి, కొత్త బసిరెడ్డి, పొద్దుటూరి ఎల్లారెడ్డి, జి.రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇక ముందు విధి నిర్వహణలో ఒత్తిళ్లకు లొంగకుండా చట్టానికి లోబడి విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు నరసింహారెడ్డి, సహాధ్యక్షుడు పసుల ధనంజయరెడ్డి, ప్రచార కార్యదర్శి నల్లమద్ది సురేందర్‌రెడ్డి, ప్రతినిధులు కోటేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దొడ్డ నారాయణ్‌రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు తలకంటి నారాయణరెడ్డి, గద్వాల జిల్లా అధ్యక్షుడు వెంకటరాజారెడ్డి, పత్రిక సంపాదకులు పట్లోళ్ల లక్ష్మారెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు మల్లు సరస్వతి, కార్యదర్శి స్వరూప పాల్గొన్నారు.

పందులను అమ్ముకున్న చరిత్ర బీఆర్ఎస్ నాయకులది

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

బాలానగర్, మే 7 : జడ్చర్ల పట్టణంలో నిరుపేదలకు సంబంధించిన వీధి పందులను అమ్ముకున్న ఘన చరిత్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గౌతాపూర్, నామ్యతండా, బోడజానంపేట, చిన్నరేవల్లి తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి సి. లక్ష్మారెడ్డిపై, నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ పాలనలో కొందరు నాయకులు జడ్చర్ల పట్టణంలో పేదలకు చెందిన వీధి పందులను అమ్ముకున్న ఘన చరిత్ర ఉందని అన్నారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పందులను అమ్ముకున్న నాయకుడు ప్రస్తుతం జడ్చర్ల పట్టణంలో కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు మరెన్నో గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే ప్రజలకు భరోసా ఇచ్చారు. నూటికి నూరుశాతం రైతుబంధు, రుణమాఫీ చేసి తీరుతామని అన్నారు. ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో పాలమూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన వంశీచంద్‌రెడ్డికి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆదిరమణారెడ్డి, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, హరిసింగ్, శంకర్‌నాయక్, కైలాబు, రాజు, రామకృష్ణ, పాల్గొన్నారు.

ఏం చేశారని ఓట్లడుగుతున్నారు : జనుంపల్లి దుశ్యంత్ రెడ్డి

నవాబ్‌పేట : తెలంగాణ ప్రజలు పదేళ్లపాటు అధికారం కట్టబెడితే రైతు రుణమాఫీ చేయకుండా కాలయాపన చేసిన వారు నేడు అధికారం పోయాక రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జనుంపల్లి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పీసీసీ అధికార ప్రతినిధి జహీర్‌అక్తర్, పార్టీ మండల అధ్యక్షులు రామచంద్రయ్య, బంగ్ల రవి, హమీద్ మహేక్, ఎంపీటీసీ తులసీరాంతో కలిసి వివిధ గ్రామాలు, తండాలలో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో రైతులకు తీపి కబురు చెబుతారని అన్నారు. అనంతరం నవాబ్‌పేట అక్షయ ప్రాతలో పని చేస్తున్న సిబ్బంది అక్షయపాత్ర క్యాంటీన్ తొలగించవద్దంటూ దుశ్యంత్ రెడ్డికి వినతి పత్రం అందజే శారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, బంక వెంకటయ్య, అంజన్‌కుమార్, నర్సింహులు, సత్యం, కోట్ల రాజేష్ పాల్గొన్నారు.

వచ్చే ఏడాది రెండు పంటలకు సాగు నీరు

- ఎన్నికల ప్రచారంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



బండర్‌పల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న జీఎంఆర్

చిన్నచింతకుంట, మే 7 : కోయిల్‌సాగర్ ఆయకట్టు పరిధిలోని లైనింగ్ మరమ్మతులు చేయించి, వచ్చే ఏడాదికి రెండు పంటలకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం మండలంలోని బండర్‌పల్లి, లాల్‌కోట, నెల్లికొండి, ఉంద్యాల, అల్లీపురం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి ఏకకలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తారని తెలిపారు. 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇస్తామని, ఎవ్వరూ బిల్లులు కట్టవద్దని తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకుడు మిథున్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, వెంకటేష్, ఎద్దుల మధుసూదన్‌రెడ్డి, వట్టెం శివకుమార్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మాయ మాటలతో మోసగించిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

మిడ్జిల్, మే 7 : కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం జడ్చర్ల పట్టణంలోని 6, 21, 22వ వార్డులలో కౌన్సిలర్లు, స్థానిక నాయకులతో కలిసి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలలోని ప్రజలు లక్ష్మారెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఒకసారి నమ్మి ఓటు వేస్తే ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా అప్పుడు చేస్తాం, ఇప్పుడు చేస్తాం అని కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీని నమ్మితే ఆగం చేస్తారన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పిట్టల మురళి, నందకిషోర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, నర్సింహ, ఉమాశంకర్‌గౌడ్, పాలాది రామ్మోహన్, బాదేపల్లి రంజిత్ బాబు, సత్యం, దేవా, సత్యం, హఫీజ్, పరమటయ్య కరాటే శ్రీను, అంజిబాబు, సాగర్, శ్రీను ఉన్నారు.

బీఆర్ఎస్ పథకాలను కాంగ్రెస్ నిలిపివేసింది : ఎంపీ మన్నె

మహబూబ్‌నగర్ రూరల్ : బీఆర్ఎస్ ప్రభుత్వం పేదప్రజల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ మండలం మాచన్‌పల్లి, పోతన్‌పల్లి, ఫతేపూర్, కోటకదిర, జైనల్లీపూర్ గ్రామాలలో మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. తమ పాలనలో అన్ని గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి పోల్స్ వేసి కరెంట్ కష్టాలు లేకుండా చేస్తే, కాంగ్రెస్ వచ్చిన తరువాత కరెంట్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. తాగునీరు కష్టాలు మొదలయ్యాయని, మళ్లీ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంపీగా మరోసారి అవకాశం ఇవ్వండి

- మన ఓటు మన మండలం వాసికే : ప్రచారంలో మన్నె గీతారెడ్డి

నవాబ్‌పేట : మాది గురుకుంట గ్రామం నవాబ్‌పేట మండలం, ప్రజల కష్టాలు తెలిసిన ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో మరోసారి అవకాశం ఇవ్వాలని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి సతీమణి మన్నె గీతారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని యన్మనగండ్ల, రుక్కంపల్లి, చెన్నారెడ్డి పల్లి, ఇప్పటూర్, మల్లారెడ్డి పల్లి, కారూర్ తదితర గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రణయ్ ఆసుపత్రిలో అరుదైన గుండె వైద్యం

- గుండె వైద్యనిపుణుడు డాక్టర్ ప్రణయ్



మాట్లాడుతున్న డాక్టర్ ప్రణయ్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), మే 7 : ప్రణయ్ కార్డియాక్ సెంటర్‌లో అధునాతన పద్ధతిలో గుండె వైద్యసేవలు అందిస్తున్నట్లు ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ ప్రణయ్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ప్రణయ్ ఆసుపత్రి ఎండీ, రిటైర్డ్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శామ్యూల్ మాట్లాడారు. ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా ఐవీఎల్ అనే అధునాతన పద్ధతిని తమ ఆసుపత్రిలో అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోనే మొదటిసారిగా ఈ పద్ధతితో పోలినా అనే గుండె రోగికి చికిత్స అందించామని పేర్కొన్నారు. గుండె ధమనులలో ఉన్న క్యాల్షియంను తొలగించి స్టంట్ అమర్చడానికి ఉపయోగించే పద్ధతినే ఐవీఎల్ చికిత్స అంటారని వివరించారు. ఈ పద్ధతిని ఉపయోగించడం ద్వారా బైపాస్ సర్జరీ అవసరం ఉండదని వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రణయ్ కార్డియాక్ సెంటర్ డెర్మటాలజిస్టు డాక్టర్ ప్రతిమ, గ్యాస్ట్రో ఎంటాలజిస్టు డాక్టర్ వివేక్‌సాగర్, గైనకాలజిస్టు డాక్టర్ నితీషా, మత్తు వైద్యనిపుణులు డాక్టర్ బాలరాజు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై అధికారుల సీరియస్

- రంగారెడ్డిపల్లి వాగును పరిశీలించిన తహసీల్దార్
- పోలీసులకు డబ్బులు ఇస్తున్నామని చెప్పిన ఇసుక వ్యాపారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహమ్మదాబాద్, మే 7 : మండలంలో ఇసుక అక్రమ వ్యాపారంపై మీడియాలో వరుస కథనాలు రావడంపై డివిజనల్ స్థాయి అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ వ్యాపారం సాగుతుందన్న కథనం మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైనందున ఆర్డీవో సీరియస్ అయినట్లు సమాచారం. పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని గండీడ్ తహసీల్దార్‌ను ఆర్డీవో ఆదేశించినట్లు తెలిసింది. దీంతో మంగళవారం రంగారెడ్డిపల్లి వాగును తహసీల్దార్ నాగలక్ష్మి పరిశీలించారు. అక్కడ చుట్టు పక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు చెప్పినట్లు తెలిపారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా తహశీల్దార్ నాగలక్ష్మిని సంప్రదించగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని మీడియాలో వస్తున్న కథనాలపై విచారణ చేసి నివేదిక అడిగారని, అందుకే రంగారెడ్డిపల్లి వాగును సందర్శించి అక్కడ స్థానికులతో మాట్లాడినట్లు ఆమె తెలిపారు. రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు చుట్టుపక్కల వారు తెలిపినట్లు వివరించారు. పోలీసుల బెదిరింపుల వల్ల ఆత్మహత్యకు పాల్పడతానన్న రంగారెడ్డిపల్లికి చెందిన కుర్వ మల్లయ్యను విచారించినట్లు ఆమె తెలిపారు. మల్లయ్య తదితరులు రాత్రి సమయంలో ఇసుక రవాణా చేసేందుకు పోలీసులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చినట్లు తహసీల్దార్ వివరించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2500 పోలీసులకు ముట్టజెప్పుతున్నట్లు మల్లయ్య చెప్పాడని ఆమె తెలిపారు. ఇందులో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాత్ర లేదని చెప్పినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. ఇసుక రవాణకు సంబంధించి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

'బీసీలకు అన్యాయం చేసిన పార్టీలకు గుణపాఠం తప్పదు'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ సాగర్

దేవరకద్ర, మే 7 : తెలంగాణలో బీసీలకు బీజేపీ అన్యాయం చేసిందని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాలతో కలిసి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అత్యధికంగా బీసీ జనాభా ఉండగా, బీసీలకు ప్రాధాన్యం ఇవ్వలేదని పేర్కొన్నారు. బీసీలకు ప్రాధాన్యం ఇవ్వకుండా అగ్రవర్ణాలకు పెద్దపీట వేసిన బీజేపీకి బీసీ సమాజం సత్తా ఏమిటో చూపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు రమేష్, కురుమయ్య నాగేష్‌గౌడ్, సత్యం విశ్వనాథ్ పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల సిబ్బందికి సరైన వసతులు కల్పించాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 7 : ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందికి సరైన వసతులు కల్పించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.నారాయణగౌడ్, రఘురామ్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు గోపాల్ నాయక్‌లు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా విధులు నిర్వహించే ఉపాధ్యాయ, ఉద్యోగులు ఇబ్బంది పడకుండా డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, పోలింగ్, కేంద్రాల్లో కూలర్స్, చల్లనినీరు, మూత్రశాలలు వంటి వసతులు కల్పించాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సిబ్బందికి ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కమిటీ పిలుపు

పాలమూరు, మే 7 : దేశంలో ప్రజాస్వామ్యం బతకాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు బదివుల్ల మీర్జాబేగ్, గడ్డమీది గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలంటే, యువతకు ఉపాధి కల్పన జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిలను గెలిపించాలని వారు ప్రజలను కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు యం.డి ముస్తాక్, భూపతి, వెంకట్, లింగంపేట సుమన్ పాల్గొన్నారు.

'మోదీ పాలనలో మాదిగలకు అన్యాయం'

పాలమూరు, మే 7 : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపే దళితుల లక్ష్యమని ఎమ్మార్పీఎస్-టీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కరపత్రాలను పంచుతూ ప్రచారం చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లనుంచి బీజేపీ మాదిగ, మాదిగ ఉపకులాలను నమ్మించి నట్టేట ముంచిందన్నారు. 2014లో మోదీ ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. నేడు బాహాటంగానే బీజేపీ పెద్దలు రాజ్యాంగాన్ని మారుస్తామని చెబుతున్న విషయాన్ని గుర్తుచేశారు. మోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడల్లా పాలమూరు-రంగారెడ్డి పథకానికి జాతీయ హోదా కల్పిస్తామని చెప్పి మోసం చేస్తున్నారని, ఎంతకాలం మోసం చేస్తారని ప్రశ్నించారు. పాలమూరు భవిష్యత్‌కోసం, మాదిగల ఎస్సీ వర్గీకరణ కోసం నిబద్ధతతో పనిచేసే వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రావుల కృష్ణ, నరసింహ, కరాటే శ్రీను, ఎల్లప్ప, జయమ్మ, నరసింహులు, రవీంద్ర పాల్గొన్నారు.

'నిరుద్యోగులను పట్టించుకోని మోదీ'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 7 : మతోన్మాద బీజేపీని ఓడించి కాగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో నిరుద్యోగులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రతీ ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ నిరుద్యోగులను పూర్తిగా మర్చిపోయిందన్నారు. కులాల, మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు